
# తెలుసుకున్న నిజం

- విన్నకోట సుశీలాదేవి



నీరజ కాలేజీ నుండి రాగానే తల్లి ఎదురొచ్చి "మావయ్య వుత్తరం రాశాడే" అంటూ అందించింది. నీరజ విసుక్కుంది.

"కాలేజీలో వాగి వాగి వచ్చాను కదా! చూస్తాలే!" అంటూ తన గదిలోకి వెళ్లింది. చీర మార్చుకుని ఉయ్యాల్లో పడుకున్న కొడుకుని ఎత్తుకుని ఒళ్లో పడుకోబెట్టుకుంది.

"అమ్మా! పగలంతా వీడేవన్నా విసిగించాడా?" తల్లి తెచ్చిన కాఫీ గ్లాసు అందుకుంటూ అడిగింది.

"ఏం లేదులే కానీ.. ముందీ ఉత్తరం చదువు.... ఏం రాశాడో!"

"అంత అర్జంటా?"

"ఏమో.... విప్పి చూడు."

కాఫీ గ్లాసు ప్రక్కన పెట్టి వుత్తరం చదివింది.

నీరజా,

మీ వూళ్లో నారాయణమూర్తిగారని రిటైర్డ్ తాసిల్దారు వున్నారు. వాళ్ళమ్మాయిని మన రవి ఎక్కడో చూశాడుట - ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటానంటున్నాడు. నువ్వు ఒక్కసారి వాళ్లింటికి వెళ్లి వాళ్ల మంచిచెడ్డలు విచారించి రావాలి. వీలైనంత త్వరలో వెళ్లాలి. నువ్వు చెప్పే వివరాల మీదే ఈ సంబంధ నిర్ణయం ఆధారపడి వుంది త్వరలోనే వుత్తరం రాస్తావు కదా:

ఆశీసులతో
మీ మావయ్య

"విన్నావుగా... మీ అన్నగారు ఏ మహత్తర విషయం రాశాడోనని ఆరాటపడ్డావు. కొడుకెవరినో చూసి ప్రేమించాట్ట. ఆ సంబంధం గురించి నేను తిరిగి వివరాలు కనుక్కోవాలి. ఇక్కడ మాకిక వేరే ఏ పనులూ లేవు. అందరి ఇళ్లకీ పోవడానికే ఇక్కడున్నాం" కోపంగా అంది నీరజ.

"పోనీలేవే! కాలేజీలో లెక్చరరు ఉద్యోగం చేస్తున్నావు. అన్నీ తెలిసినదానివని ఈ బాధ్యత నీమీద పెట్టాడు. కనుక్కుంటే ఏవయింది?... వాడేవన్నా పరాయివాడా?" అంది ఆవిడ అన్న గారిని వెనకేసుకొస్తూ!

"అయితే ఆ జ్ఞానం ఆయనకి ఉండొద్దూ. నాన్నగారు మంచి సంబంధం చెప్తే ఒప్పుకున్నాడా?"

"కొడుకెవరినో ఇష్టపడుతున్నాడని రాశాడుగా! ఇంకేం ఒప్పుకుంటాడు! పోనీలే అదంతా ఎందుకు? ఇప్పుడీ పని చెయ్యి!"

"ఆ.... వూరికే మనల్ని తిప్పడమే కానీ మన నిర్ణయాల్ని బట్టి చేస్తాడా?"

"చేస్తాననే అంటున్నాడుగా... వెళ్లిరా..." అంది బ్రతిమాలుతున్న ధోరణిలో...

"సరేలే" అంగీకరించింది.

"ఈ నెలాఖరుకు వూరు వెళ్లిపోదామనుకున్నా గదా! వీడి పెళ్లి కుదిరితే అది కూడా చూసి ఏకంగా వెడతా!" అంది తల్లి!

"ముందు నన్ను వెళ్లి చూసి రానీ-" అంటూ కొడుకుని ఎత్తుకుని బయటకు వచ్చింది.

మర్నాడు సాయంత్రం కాలేజీ నుండి వస్తూ మావయ్య ఇచ్చిన అడ్రసు ప్రకారం ఇల్లు వెతుక్కుంటూ బయలుదేరింది నీరజ. ఒక అర గంట తిరగ్గా ఇల్లు దొరికింది.

ఆ ఇంటిని చూసి నివ్వెరపోయింది నీరజ. తాసిల్దారు అంటే మేడ కాకపోయినా కనీసం డాబా ఇంట్లోనైనా ఉండడా అని అనుకుంటుండగా... ఎదురుగా జీర్ణావస్థలో నున్న ఒక పెంకుటిల్లు ప్రత్యక్షమవడంతో నివ్వెరపోయింది. ఆ ఇంట్లో రెండు మూడు కుటుంబాలున్నట్లున్నాయి. అంటె బహుశ ఇది ఆయన అద్దె ఇల్లన్నమాట - అనుకుంది. ఇంటిముందు మురుగు కాలవలు పొంగిపొర్లుతున్నాయి. ఇంటి లోపలికి వెళ్లడానికి ఆ కాలవ మీదుగా ఒక నాపరాయి వేశారు. ఆ నాపరాయి మీద తన ఎత్తు చెప్పులతో నడవ లేనేమోనని భయం వేసింది నీరజకి. కాలు జారి కాలవలో పడితే అంతకంటే అవమానం ఏముంది? అనుకుంటూ ఇంట్లోకి వెళ్లే ప్రయత్నాన్ని విరమించుకుని వెనుదిరిగి వచ్చేసింది. నీరజని చూడగానే - ఏం వెళ్లావా? ఏవన్నారు" అంటూ అడిగింది తల్లి.

"వెళ్లలేదమ్మా! కుదరలేదు! రేపు వెడతాలే!" అని - మరో ప్రశ్నకు తావివ్వకుండా లోపలకు వెళ్లిపోయింది నీరజ.

ఆ స్త్రీ భర్త మోహనరావుతో అంది.. "తాసిల్దారంటే పెద్ద మేడ హంగామా వుంటాయనుకున్నాను. కానీ కూలిపోయే స్థితిలో వున్న ఒక చిన్న పెంకుటింట్లో వున్నాడు. ఇంటి ముందు పెద్ద మురుగు కాల్వలు అటువంటి ఇంట్లో వున్న అమ్మాయినా మా రవి వరించేది. ఛ... ఛ.. నాకే అవమానంగా వుంది!"

"మధ్యలో నీకెందుకు బాధ. అతనికిష్టమైంది చేసుకుంటాడు!" అన్నాడు మోహన్రావు.

"రవి పరాయివాడా! మా మావయ్య కొడుకు... పైగా బ్యాంకు ఆఫీసరు. ఇటువంటి దరిద్రపుగొట్టు సంబంధం చేసుకుంటే ఈ వూళ్ళో నా పరువుండాలా?"

మోహన్రావు విసుక్కుంటూ-

"నీకెంతసేపు హోదా - ఆస్తి అధికారం కావాలి...? ముందు వాళ్లతో మాట్లాడు ఆ తర్వాత నిర్ణయించు..." అన్నాడు.

"ఏం మీ కక్కర్లేదా ఆస్తి.... కట్నం డబ్బు కోసం మమ్మల్నెంత పీడించారు!" అంది అక్కసుగా...

"సరేలే! ఇప్పుడవన్నీ దేనికి?" అదంతా అయిపోయిందిగా".

"అప్పుడైనా-ఇప్పుడైనా మనిషికి ముఖ్యం ఆస్తిపాస్తులే."

"అవుననుకో!"

"నాకీ సంబంధం ఇష్టం లేదని రేపే రాస్తా!"

"అలా రాసేముందు ఆయనతో ఒకసారి మాట్లాడు. మీ మావయ్య చెప్పిన పని చేశామనే తృప్తి వుంటుంది!"

"వూ.... సరే! అలాగే వెళ్దాంలెండి!" అంది ఆలోచిస్తూ.

★ ★ ★

మర్నాడు హీల్స్ తీసి మామూలు చెప్పులేసుకుని వాళ్లింటికి బయలుదేరింది నీరజ! మురుగు కాల్వలు దాటుకుని ఇంటిముందు నిలిచి తలుపు తట్టింది. ఒక యాభై ఏళ్ల స్త్రీ వచ్చి తలుపుతీసింది.

"ఎవరు కావాలండీ!" అడిగింది.

నీరజ తనని తాను పరిచయం చేసుకుంది.

ఆవిడ "రండి" అంటూ లోపలకు తీసుకెళ్ళింది.

చిన్నగది - ఒకవైపు మంచం. దాని ప్రక్కనే టి.వి., చిన్న బీరువా, మరొక ప్రక్కగా పుస్తకాల అల్మారా! ఒక ప్రక్కగా తాడుమీద బట్టలు వేలాడుతున్నాయి. వీటన్నిటి మధ్యనున్న కొద్ది స్థలంలో నీరజకు కుర్చీవేసి కుర్చోమందావిడ.

"ఆయన భోజనం చేస్తున్నారు..."

నీరజ ఆశ్చర్యపోతూ టైము చూసుకుంది. ఆరున్నరయింది. ఇది తను కాఫీ తాగే టైము. 'ఇప్పుడు భోజనం ఏమిటో' అనుకుంది...




పది నిముషాలు గడిచాయి. గదిలో ఏదో గబ్బు వాసన వేస్తోంది. నీరజ కూర్చోలేకపోతోంది. మరో అయిదు నిముషాల్లో ఆయన వచ్చాడు. సన్నగా ఎర్రగా పొట్టిగా వున్నాడు.

పరిచయాలయాక నీరజ తను వచ్చిన పని చెప్పింది.

"చాలా సంతోషమండీ! మా సంబంధాన్ని కోరి రావడం మా అదృష్టం!" అన్నాడాయన.

"మీ అమ్మాయిని మా రవి ఎక్కడో చూశాడుట. నచ్చిందిట. మిగతా విషయాలు మీతో మాట్లాడమని మా మామయ్య వుత్తరం రాస్తే వచ్చాను - మా మావయ్య మున్సిపల్ కమిషనర్ చేసి రిటైరైనాడు. మా రవి బ్యాంకు ఆఫీసరు" గర్వంగా చెప్పింది.

ఆ మాటలకు ఆయనలో ఎటువంటి స్పందన కనబడలేదు. చాలా మామూలుగా చూశాడు!

"మీ అభిప్రాయం చెప్తే...." అంది నీరజ అర్థోక్తిగా.

"ఏ విషయంలో..."

"ఈ రోజుల్లో పెళ్లికి కావల్సినవేమిటో మీకు తెలిసే వుంటుంది కదా!" నవ్వింది నీరజ.

"మీరడిగేది బహుశ కట్నకానుకల విషయమేమో నేను వాటికి చాలాదూరం. నాకిద్దరూ అమ్మాయిలే. వాళ్ళని పోస్టుగ్రాడ్యుయేట్లని చేశా. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా విద్యార్హతలు కల్పించాను. నా కూతుళ్ల గురించి చెప్పుకోవడం బాగుండదు. కానీ ఇద్దరు జాతి రత్నాలు. ఇద్దరూ చక్కగా వుంటారు. మంచి క్రమశిక్షణతో పెరిగారు. ఈ అమ్మాయి మా పెద్దమ్మాయి! పేరు రమాదేవి" లక్ష్మీ! అమ్మాయి ఫోటో వీరికి చూపించు" అన్నాడాయన.

ఆవిడ పిల్లల ఫోటోలు చూపించింది. ఇద్దరూ చక్కగా వున్నారు. పెద్దమ్మాయి మరీ అందంగా వుంది. ఈ అందమే రవిని ఆకర్షించి వుంటుంది అనుకుంది నీరజ.

"నేను తాసిల్దారుగా ఉద్యోగం చేసినా ఎంతో నిజాయితీగా పనిచేశాను. ఒక్క పైసా లంచం తీసుకోలేదు. అందుకే రిటైరయినా నాకొక స్వంత ఇల్లు లేదు. అయినా విచారించను. నా ఉద్యోగ ధర్మం సజావుగా నిర్వర్తించాననే తృప్తి వుంది. రిటైరైనాక వచ్చిన డబ్బుని నాల్గు భాగాలు చేసి మాకు కొద్దిగా వుంచుకుని మా ఇద్దరి అమ్మాయిల పేర్న చెరొక యాభైవేలు బ్యాంకులో వేశాను. నేను వేరే కట్నం ఇవ్వలేను.. ఇవ్వను కూడా... పెళ్లయ్యాక ఆ డబ్బు నా కూతురిష్టం.... భర్తకిచ్చినా... తను వాడుకున్నా!"

ఇంతలో, ఆవిడ 'టీ' తెచ్చింది.

"తీసుకోండి!" అందావిడ.

"మీరో!"

"మేం కాఫీ... టీలు తాగం. ఇవి కేవలం అతిథులకోసమే".

వాళ్ళ పద్ధతి ఆశ్చర్యంగా తోచింది నీరజకి!

నీరజ "టీ" తీసుకుంటుంటే... ఆయన మళ్లీ చెప్తున్నాడు.

"నా కూతుళ్లకు అన్నివిధాలా వారికి తగిన వ్యక్తులతోనే పెళ్లి జరిపిస్తాను. అత్తవారింట్లో అనుకూల దాంపత్యం ఏర్పడితే సరే! కాని విధి వక్రించి జీవితంలో వారికేదైనా కష్టం వస్తే వాళ్లు అత్తగారింట్లో ఏడుస్తూ బ్రతకనక్కర్లేదు! 'మీ కష్టాల్లో ఆదుకోవడానికి మేమున్నాం. పిరికిగా ఆత్మహత్యలు చేసుకోనక్కర్లేదు. మా దగ్గరకు వచ్చేసెయ్యండి! ధైర్యంగా మనుషుల్లా బ్రతకండి. ఈ సమాజాన్ని ఆత్మ విశ్వాసంతో ఎదుర్కోండి! మీకన్ని విధాలా మేము అండగా వుంటాం. ఇలా మా పిల్లలకు తరచూ చెప్తుంటాను. వాళ్లు హాయిగా జీవిస్తూ పదిమందికీ ఆదర్శం కావాలని నా కోరిక. సమస్యల్ని ధైర్యంతో ఎదుర్కోమని వాళ్లకు పదేపదే చెప్తాను. నా పిల్లలు ఆదేవిధమైన మనస్తత్వాన్ని అలవాటు చేసుకున్నారు. బంగారంతో అందమైన ఆభరణం చేయొచ్చు... తలలు నరికే కత్తిని కూడా చేయొచ్చు. నా కూతుళ్లని అసూయాద్వేషాలతో బాధిస్తే కలకత్తా కాళికలవుతారు! అయినా

వాళ్లమ్మాలానే వాళ్లు కూడా మంచి గృహిణులవు తారనే నా నమ్మకం!" అంటూ భార్యవేపు చూసి నవ్వాడాయన.

ఆవిడ బదులుగా చిరునవ్వు నవ్వింది.

"ఇదండీ! మాస్థితి! మా పిల్లలకు విద్యా-వినయం కట్నాలైతే అందం-అణకువ ఆభరణాలు!"

నీరజ నవ్వు తెచ్చుకుని -

"చాలా బాగుందండీ! మీలాటి తల్లిదండ్రులు లభించడం మీ అమ్మాయిల అదృష్టం. ఇంత మంచి ఆదర్శాలతో పెంచారు. లోకంలో తల్లి తండ్రులందరూ మీలా ధైర్యం చెప్తే ఆడపిల్లల ఆత్మహత్యలే వుండవు!"

"బాగా చెప్పారు! చాలామంది నా మాటల్ని చాదస్తంగా భావిస్తారు. కానీ మీరు చదువుకుని వుద్యోగం చేస్తున్నారు కాబట్టి నన్ను అర్థం చేసు కున్నారు. మీలాటివాళ్లు ఒక్కరున్నా చాలు! నాకదే తృప్తి!"

"ఇక నేను వస్తానండీ! మా మావయ్యకు అన్ని వివరాలతో వుత్తరం రాస్తా!" అని లేచి వచ్చేసింది నీరజ!

★★★

ఆ రాత్రి భర్తకు జరిగింది చెప్తూ....

"ఆయనొట్టి అహంకారి! ఈ ప్రపంచంలో తానే గొప్ప నిజాయితీపరుడ్నని - తన కూతుళ్లే జాతిరత్నాలని మురిసిపోతున్నాడు. తండ్రికే అంత అహంకారం వుంటే కూతుళ్లకు ఇంకెంత వుంటుందో! ఇటువంటి వాళ్లతో కాపరం చేయడం రవికి సాధ్యమవుతుందా! పైపై అందాలు చూసి మోసపోతున్నాడు. ఆ పిల్ల ఒక్క క్షణం వాడితో సవ్యంగా సంసారం చేయదు. ఇటువంటి పిల్లను పెళ్లి చేసుకునేకంటె అసలు పెళ్లే మానుకోవడం ఉత్తమం!" అంది నీరజ ఆవేశంగా.

మోహనరావు నీరజ వేపు ఒక్క క్షణం పరి శీలనగా చూసి-ఏదో అనబోయి ఆగి పోయాడు.. "ఎవరికోసమో-నేనుందుకు బుర్ర పాడుచేసు కోవాలి" అనుకున్నాడు.

"మీ అమ్మకేం చెప్తావ్?"

"సంబంధం మంచిది కాదని"

భార్యవేపు అస్పహ్యంగా చూసి ముఖం తిప్పుకున్నాడు. మర్నాడు మావయ్యకు సంబంధం గురించి రాసి ఉత్తరం పోస్టులో వేసేవరకూ మన శ్శాంతి లభించలేదు నీరజకు.

"అమ్మయ్య పెద్ద ప్రమాదం తప్పింది!" అనుకుంది తృప్తిగా!

★ ★ ★

మరో రెండు నెలల తర్వాత రవికి లక్షాదికారి ఏకైక కూతురితో పెళ్లి జరిగింది. పెళ్లికూతురు టెన్త్ తప్పింది! పైగా అనాకరి! నీరజ రెండురోజులు ముందుగానే పెళ్లికి వచ్చింది. ఆడపెళ్లివారు తనకు పెట్టిన పట్టుచీర చూసుకుని మురిసిపోయింది. రవి తను చెప్పిన లక్షాధికారుల సంబంధం చేసు



కున్నాడని సంబరపడింది. గంటకో చీర మారుస్తూ పెళ్లి పందిరంతా తానేగా తిరిగింది.

రవి ముఖం పెళ్లయ్యేంతవరకు కళాహీనంగా వుండటం ఆ హడావుడిలో నీరజ గమనించలేదు.

నీరజ ప్రయాణమవుతోంటే రవి వచ్చి "నీరజా! ఇదిగో!" అంటూ ఒక కవరు అందంచాడు.

"ఏమిటిది రవీ!"

"ఇంటికెళ్లి విప్పి చూడు!" అని వెళ్లిపోయాడు.

కవరు బరువుగా వున్నట్లు తోచింది నీరజకు. పెద్ద సంబంధం వచ్చింది కదా! ఆ సంతోషం కొద్దీ రవి ఘనంగా తనకు పెళ్లి కానుకేదో ఇచ్చి వుంటాడు. ఇంటికెళ్లి భర్త ముందు కవరు విప్పి ఆయనకి గొప్పగా చూపాలి అనుకుంది. ఆ కవరు సూట్‌కేసులో పడేసింది. ఇంటికొచ్చిన మర్నాడు సూట్‌కేసు సర్దుతోంటే ఆ కవరు బయటపడింది. నీరజ అది చేతిలో పట్టుకుని భర్త దగ్గరకు వచ్చింది!

"ఏవండీ! మా రవి ఈ కవరు ఇచ్చాడు!"

"ఏమిటది!" చదువుతున్న పుస్తకంలోనుండి తల తిప్పకుండా అడిగాడు.

నీరజ ఆ పుస్తకం తీసి పక్కన పడేసి - భర్తని తిప్పి కూర్చోబెట్టింది.

"మా రవి నాకెంత గొప్ప ప్రెజంటేషన్ ఇచ్చాడో చూద్దురుగాని, బహుశ పెద్ద మొత్తంలో నాకేదో గిఫ్ట్ చెక్ ఇచ్చి వుంటాడు!" అంటూ కవరు చింపింది.

దాన్లోనుండి రెండు కాగితాలు బయటపడ్డాయి.

"ఇవేమిటో!" తెల్లబోతూ చూసింది.

"ఆ కాగితాల మీద ఏదో రాసి వుందిగా చదువు! తెలుస్తుంది".

నీరజ చదవసాగింది!

నీరజక్కా!

నువ్వు నాకు మేనత్త కూతురివయినా ప్రేమతో, గౌరవంతో 'అక్కా' అని పిలిచేవాడిని. ఈ తమ్ముడిని అర్థం చేసుకునేది ఈ లోకంలో అక్క ఒక్కతె అని అతి పెద్ద బాధ్యత నీమీద పెట్టాను. నేను రమను పెళ్లి చేసుకోవాలను కున్నప్పుడు నాన్న వ్యతిరేకించాడు. నాన్నగారికి నువ్వంటే ఇష్టం. నీమాట కాదనడాయన. నేను కూడా నీ గురించి ఏవేవో వూహించుకుని ఈ పెళ్లి నిర్ణయించే అధికారం నీకిచ్చి పెద్ద తప్పు చేశాను. నీ నిర్ణయం మీద ఆధారపడాలనుకున్నాను. నాన్నగారు నువ్వు రమని ఇష్టపడితే తాను ఒప్పుకుంటానన్నారు. అందుకే నీకు వుత్తరం రాశారు. నువ్వు చదువుకుని ఉద్యోగం చేస్తున్న దానివి. గొప్ప ఆదర్శాలతో పత్రికలలో వ్యాసాలు రాస్తున్న దానివి, నీకు తప్పకుండా ఆ కుటుంబం నచ్చుతుందనే గాఢమైన అభిప్రాయం నాది. నువ్వెంతో ఆనందంగా ఆ సంబంధాన్ని రికమండ్ చేస్తూ నాన్నకు ఉత్తరం వ్రాస్తావని నాదృఢమైన సంకల్పం. నా ఆలోచనలో నాకెటువంటి సందేహం లేదు. అందుకే నీరజ ఒప్పుకుంటే ఈ పెళ్లి జరిపిస్తానని నాన్నగారు అంటే ఆనందంగా అంగీకరించాను. 'మన ఈ పెళ్లి తప్పకుండా జరుగుతుందని మన పెళ్లికి మధ్యవర్తి మా అక్క అని' నీ గురించి ఎంతో గొప్పగా రమకు చెప్పాను. ఎందుకంటే నీమీద నాకంత నమ్మకం. కాని... కాని... నా ఆలోచనల్ని తలక్రిందులు చేస్తూ - నా ఆశల సౌధాన్ని సమూలంగా కూల్చివేస్తూ- నాకలల ప్రపంచాన్ని సర్వనాశనం చేసే ఉత్తరాన్ని నువ్వు రాశావు. నాన్నగారికిచ్చిన మాటకు కట్టుబడి-నా ప్రేమని సమాధి చేసి ఈ పెళ్లికి ఒప్పుకున్నాను నీరజా! నువ్వొక ఉన్నత స్త్రీమూర్తివనుకున్నాను... కానీ సాటి స్త్రీపై అసూయతో నిందలు వేసేటంత హీనస్థితికి దిగజారుతావనుకోలేదు. ఆ ఆదర్శ కుటుంబం మీద - రమ అందం మీద నీకెంత అసూయద్వేషాలున్నాయో నీ వుత్తరంలోని ప్రతి అక్షరం చెప్తోంది. నీ అసూయని వెల్లడించుకోడానికి అమాయకురాలైన రమపై నిందలు వేయడానిక్కూడా వెనుదీయలేదు. రమలాటి దేవతామూర్తులను చూవాక స్త్రీలపై గౌరవం ఇను మడించింది నాకు. కానీ నీలాటి అసూయాపరులు తులసివనంలో గంజాయిమొక్కల్లా వుంటారని-అటువంటివారికి దూరంగా వుండాలని నాకిప్పుడే తెలిసింది.

నీది సంస్కారం లేని చదువని - నీ ఆదర్శాలు రచనల వరకే పరిమితమని-నువ్వు కూడా అతి సామాన్యస్త్రీవని తెలుసుకోలేక పెద్ద పొరపాటు చేశాను.

చేతులు కాలేక వగచి ప్రయోజనమేముంది? కాని ఒక విషయానికి నీకు కృతజ్ఞతలు చెప్పాలి! జీవితంలోని ముఖ్యమైన విషయాల్లో స్వయంగానే నిర్ణయాలు తీసుకోవాలని ఇతరులపై ఆధార పడకూడదనే గొప్ప సత్యాన్ని తెలియచెప్పావు. ఈ అనుభవంతో పెద్ద గుణపాఠం నేర్చుకున్నాను. నా జీవితంలో నేరము నాదే కాబట్టి శిక్ష నేనే అను భవిస్తున్నాను.

శెలవ్
రవీ.

అది చదివి పశ్చాత్తాపంతో కన్నీరు కారుస్తున్న భార్యవేపు జాలిగా చూశాడు మోహనరావు. ❋